E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :102 శనివారం 12 సెప్టెంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

# పేదల ఇళ్లపై మళ్లీ డ్రామా ఎందుకు?

**మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లను వారికే ఇవ్వాలి**

**గతంలో డ్రా తీసి కేటాయించిన ఇళ్లపై మళ్లీ పంచాయతీ ఎందుకు?**

**ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం**

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



2 లో

**జనగామ, సెప్టెంబర్ 11 (తెలుగు గళం)**

జనగామ పట్టణంలో పేదల ఇళ్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జగ్గుల జాన్ వెస్లీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారుల సమక్షంలో డ్రా నిర్వహించి 72 మంది పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తిరిగి వారికే అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే అధికారికంగా కేటాయింపులు పూర్తయిన తర్వాత మళ్లీ డ్రా నిర్వహిస్తామనడం పేదలను ఇబ్బందులకు గురిచేయడమేనని మండిపడ్డారు. జనగామ పట్టణంలో 2012--13లో ఇళ్లు లేని 1,144 మంది పేదలను గుర్తించి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇచ్చిందని జాన్ వెస్లీ తెలిపారు. అయితే స్థలాలు ఇచ్చినప్పటికీ గృహ రుణాలు, విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించకపోవడంతో పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోయారని చెప్పారు. కొందరు లబ్ధిదారులు అప్పులు చేసి, తమ శక్తిమేరకు రూ.2--3 లక్షలు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల స్థలాలను తీసుకుని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించేందుకు ప్రయత్నించగా లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించారని ఆయన గుర్తుచేశారు. పేదలు నిర్మించుకున్న ఇళ్లు, స్థలాలను బలవంతంగా స్వాధీనం చేసుకోవద్దని, చట్ట ప్రకారం వ్యవహరించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. 2019లో అప్పటి కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ పేదలతో మాట్లాడి ఇళ్లు లేని వారికి స్థలాలు కేటాయించేలా లేఅవుట్ రూపొందించారని తెలిపారు. ఆర్థిక స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేని 72 మంది పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని నిర్ణయించి, 2023 జూలైలో అప్పటి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రా నిర్వహించి ఇళ్లను కేటాయించారని చెప్పారు.

**అధికారుల నిర్ణయాలకు విలువ లేదా?**

గతంలో అధికారుల సమక్షంలో డ్రా నిర్వహించి ఇళ్లు కేటాయించిన తర్వాత ఇప్పుడు మళ్లీ డ్రా నిర్వహిస్తామని చెప్పడం పేదలకు తీవ్ర అన్యాయం చేయడమేనని జాన్ వెస్లీ అన్నారు





# వికలాంగుల హక్కులపై కేంద్రం కుట్రలు చేస్తోంది

**ఆహార భద్రత హక్కును తొలగించే అధికారం కేంద్రానికి ఎక్కడిది?**

**ఆర్‌పీడీ చట్టం సెక్షన్ 74ను సవరించాలి..ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి**

**నవంబర్, డిసెంబర్‌లో దేశవ్యాప్త ఉద్యమం చేపడతాం: ఎన్‌పీఆర్‌డీ**

**తెలుగు గళం న్యూస్ న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11**



2 లో

వికలాంగులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆరోపించింది. జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ)లో ప్రతిపాదిత సవరణలు వికలాంగుల ఆహార భద్రత హక్కును దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. వికలాంగులకు అంత్యోదయ అన్న యోజన రేషన్ కార్డులు అందే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించింది. న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జీత్ భవన్‌లో సెప్టెంబర్ 11న ఎన్‌పీఆర్‌డీ జాతీయ కార్యవర్గ సమావేశం జాతీయ అధ్యక్షుడు గిరీష్ కీర్తి అధ్యక్షతన జరిగింది. దేశవ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ మాట్లాడుతూ..పోరాటాల ఫలితంగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది వికలాంగులకు అంత్యోదయ అన్న యోజన రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు.

# ఏజెన్సీలో గుడుంబా జోరు.. ఎక్సైజ్ శాఖ నిద్రపోతోందా?

**బహిరంగంగానే గుడుంబా విక్రయాలు..అధికారుల నిఘా ఎక్కడ?**

**తయారీ, రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజల డిమాండ్**

**గుడుంబా దందాపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్**








2 లో

# దేశాధినేతలతో మోదీ వరుస భేటీలు!




2 లో

**పుతిన్, పెజెష్కియాన్‌లతో ప్రధాని భేటీలు**

**జిన్‌పింగ్ రాకపై సర్వత్రా ఉత్కంఠ**

**ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెడుతున్న చైనా అధ్యక్షుడు**

**మోదీ-జిన్‌పింగ్ భేటీపై ప్రపంచం చూపు**

**రక్షణ, దౌత్య సంబంధాలపై పుతిన్‌తో చర్చలు**

**ఐరాస సెక్రటరీ జనరల్‌తోనూ కీలక సమావేశం**

**వాణిజ్యం, టెక్నాలజీపై బ్రిక్స్ దేశాల దృష్టి**

# సీఎం బ్రదర్స్ భూదందా?

**భూములపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు**

**కోటి ఎకరాలు 22ఏ జాబితాలోనా?**

**రైతులను ఇబ్బంది పెడుతున్నారంటూ ఫైర్**

**సీఎం బ్రదర్స్‌పై భూదోపిడీ ఆరోపణలు**

**సమాంతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందని విమర్శ**

**ఫ్యూచర్ సిటీ భూములపై ప్రశ్నలు**

**కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ మండిపాటు**

**రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారన్న ధీమా**



2 లో

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భూములను సీఎం రేవంత్ రెడ్డి హారతి కర్పూలంలో కాజేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. 22ఏ నిషేధిత భూములపై తెలంగాణ భవన్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. శాసనసభలో ప్రజ సమస్యలపై మాట్లాడనివ్వకుండా తమ పార్టీ ఎమ్మెల్యేలను మెడ పట్టి గెంటేశారని ఫైర్ అయ్యారు. సీఎం బాగోతాలు బయటపడతాయనే భయంతోనే తమను శాసనసభ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ల్యాండ్ చోరీ విపరీతంగా జరుగుతోందని, ఇందిరమ్మ రాజ్యంలో భూములను దోచుకుంటున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు..**

బీఆర్ఎస్ హయాంలో 22ఏ కింద కేవలం 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండగా.. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని కోటి 16 లక్షల ఎకరాలకు పెంచారని కేటీఆర్ ఆరోపించారు.

# కులగణనలో తెలంగాణ రోల్ మోడల్!

**2027 జనగణనలో బీసీ లెక్కలు చేర్చాలి**

**బీసీల జనాభాపై మా దగ్గర పక్కా గణాంకాలు**

**42 శాతం రిజర్వేషన్లకు తెలంగాణ అడుగులు**

**50 శాతం పరిమితి దాటేందుకు శాస్త్రీయ ఆధారాలు**

**జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం చేయాలి**

**కేంద్రం కూడా తెలంగాణ బాటలో నడవాలి**

**బీసీ కులాల లెక్క తేల్చాలన్న పొన్నం**

2 లో

# ఐటీ జాబ్స్‌కు తెలంగాణ బిగ్ బూస్ట్!

**కొత్త జీసీసీ పాలసీకి కసరత్తు**

**75కు పైగా జీసీసీల ఏర్పాటు**

**లక్ష మంది యువతకు ఉద్యోగాలు**

**టైర్-2 నగరాలకు ఐటీ విస్తరణ**

**మూతపడిన ఐటీ హబ్‌లకు పునర్జీవం**

**త్వరలో ఆదిలాబాద్ ఐటీ హబ్**

**డేటా సెంటర్లపై ప్రత్యేక దృష్టి**



2 లో

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన ఐటీ హబ్స్, టవర్లపై అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. యాంకర్ పార్టనర్స్ లేదా ఇండస్ట్రీ పార్టనర్స్ భాగస్వామ్యం లేకుండానే గతంలో వీటిని నిర్మించడం వల్ల చాలా చోట్ల ఇవి నిరుపయోగంగా మారాయని తెలిపారు. నిజామాబాద్ ఐటీ టవర్, ఐటీ హబ్‌పై శాసనసభ్యుడు అడిగిన ప్రశ్నకు శ్రీధర్ బాబు శాసనసభ వేదికగా సమాధానమిచ్చారు. ప్రణాళికారాహిత్యంతో మూతపడిన ఐటీ హబ్‌లను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని స్పష్టం చేశారు.

"హైదరాబాద్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు.. నల్గొండ, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, కరీంనగర్ లాంటి టైర్ - 2 నగరాలకూ ఐటీ కంపెనీలకు విస్తరిస్తున్నాం.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌లో భారత్ రికార్డు!

**80 లక్షలు దాటిన టీకా డోసుల పంపిణీ**

**గర్భాశయ క్యాన్సర్‌కు ముందస్తు రక్షణ**

**14 ఏళ్ల బాలికలే ప్రధాన టార్గెట్**

**ప్రభుత్వ కేంద్రాల్లో ఉచితంగా సింగిల్ డోస్**

**ఆంధ్రప్రదేశ్‌లో 98 శాతానికి పైగా వ్యాక్సినేషన్**

**81 శాతంతో రెండో స్థానంలో తమిళనాడు**

2 లో

# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ

**తెలంగాణ సర్కార్‌కు నోటీసులు జారీ**

**పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల పిల్**

**55 కిలోమీటర్లలో 20 కిలోమీటర్లపైనే స్టేటీ?**

**మృగవాణి నేషనల్ పార్క్‌పై ఆందోళన**

**ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వద్ద నిర్మాణాలపై అభ్యంతరం**

**వచ్చే నెల 16కు తదుపరి విచారణ**

**ప్రాజెక్టుపై మళ్లీ మొదలైన న్యాయ వివాదం**

2 లో

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక




## కులగణనలో తెలంగాణ రోల్ మోడల్!



**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (కుల సర్వే) దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాబోయే 2027 జాతీయ జనగణనలో బీసీ, ఓబీసీ కులగణనను తప్పనిసరిగా చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్రంలో బీసీల జనాభాపై తెలంగాణ ప్రభుత్వం వద్ద అత్యంత ప్రామాణికమైన, కచ్చితమైన గణాంకాలు ఉన్నాయని తెలిపారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని దాటాలంటే సైంటిఫిక్ కుల గణాంకాలు చాలా అవసరమని, రాష్ట్రంలో విజయవంతంగా నిర్వహించిన సర్వే దానికి బలమైన ప్రాతిపదికగా నిలుస్తుందని మంత్రి వివరించారు. త్వరలో జరగబోయే దేశవ్యాప్త జనగణనలో బీసీ, ఓబీసీ వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, బీసీలకు జనాభా ప్రాతిపదికన పూర్తి న్యాయం జరగాలని కోరారు. “బీసీల జనాభాను సరిగ్గా లెక్కించండి.. వారికి తగినంత న్యాయం చేయండి” అని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం సాధించాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం ఈ కుల సర్వేను విజయవంతంగా పూర్తి చేసిందని, కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే బాటలో నడిచి బీసీ కులాల లెక్క తేల్చి న్యాయం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## దేశాధినేతలతో మోదీ వరుస భేటీలు!

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** బ్రిక్స్ సభ్య దేశాధినేతలతో ప్రధాని నరేంద్రమోడీ భేటీ కానున్నారు. రష్యా, ఇరాన్ దేశాధినేతలతో పాటు.. ఐక్య రాజ్య సమితి సెక్రటరీ జనరల్ తో మోడీ సమావేశం అవుతారు. తొలుత రష్యా అధ్యక్షుడు పుతిన్ తో, ఆ తర్వాత ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తో, సాయంత్రం ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తో ప్రత్యేకంగా భేటీ అవుతారని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇప్పటికే వీరంతా భారత్ కు చేరుకోగా.. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ కూడా బ్రిక్స్ సమావేశానికి రానున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత జిన్ పింగ్ భారత్ కు వస్తుండటంతో.. ప్రధాని, జిన్ పింగ్ ల భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరిసారిగా ఆయన 2019లో చెన్నై సమీపంలోని మామల్లపురంలో ప్రధానితో అనధికారిక సదస్సు నిమిత్తం భారత్ కు వచ్చారు. అంతకుముందు 2016లో బ్రిక్స్ సదస్సుకు వచ్చారు.

18వ బ్రిక్స్ సమావేశానికి విచ్చేసిన పుతిన్ తో ప్రధాని భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు, కీలక రక్షణ ఒప్పందాలపై చర్చిస్తున్నారు. కాగా.. దేశ రాజధాని అయిన ఢిల్లీలో 12,13 తేదీల్లో బ్రిక్స్ సమావేశం జరుగనుండగా.. బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా ప్రతినిధులు భారత్ కు చేరుకుంటున్నారు. ఈ సదస్సులో బ్రిక్స్ దేశాల మధ్య వ్యాపారాలను మరింత విస్తరించడం, టెక్నాలజీలో సహకారాన్ని పెంపొందించడం, ప్రధాన అంతర్జాతీయ సమస్యలపై చర్చించి, సమన్వయం చేసుకోవడం వంటి ప్రయోజనాలపై చర్చించనున్నారు.

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ




**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మళ్లీ న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ తాజాగా రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అయితే, మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు, అనుమతులు పూర్తి లోపభుయిష్టంగా ఉన్నాయి పిటిషనర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కి.మీ ఉంటే.. కేవలం 20 కి.మీ మేర మాత్రమే స్టడీ చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా ఇదే రీజియన్‌లో మృగవాణి నేషనల్ పార్క్ కూడా ఉందని పేర్కొన్నారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సమీపంలో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న నిర్ణయంతో పాటు వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా రిటైర్డ్ ఇంజినీర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతివాదిగా తెలంగాణ ప్రభుత్వం..

అయితే, పిటిషనర్ల అప్పీల్‌ను పరిశీలించిన చెన్నై ఎన్జీటీ బెంచ్.. ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తన వాదనలను, సంబంధిత వివరాలను ట్రిబ్యునల్‌కు వెంటనే అందజేయాలని పేర్కొన్నది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన ఓ పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేయగా తాజా పిటిషన్‌తో మరోసారి ప్రభుత్వానికి నోటీసులు రావడం ప్రధాన్యతను సంతరించుకుంది.

విచారణ వచ్చే నెల వాయిదా..

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను ఎన్జీటీ వచ్చే నెల 16కు వాయిదా వేసింది. ఈ క్రమంలోనే ఆ రోజు జరిగే విచారణలో పర్యావరణ అనుమతులపై అప్పీల్‌దారులు లేవనెత్తిన అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు అత్యంత కీలకం కానున్నాయి. అయితే, మూసీ ప్రక్షాళనను మొదటి నుంచి ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తుండా.. తాజాగా మరోసారి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో సదరు ప్రాజెక్టుపై పిటిషన్ దాఖలు కావడం హాట్ టాపిక్‌గా మారింది.

## యువత సత్తాతో భారత్ జోరు!

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** భారత దేశంలోని యువశక్తి సామర్థ్యంపై సందేహాలు అవసరం లేదని 2047 నాటికి ‘వికసిత భారత్’ ఖాయమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ముంబైలో జరుగుతున్న ‘గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026’లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు.. బిలియన్ల కొద్దీ లావాదేవీలను సునాయాసంగా ప్రాసెస్ చేస్తున్న యూపీఐతో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించడం .. మొదలుకుని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలబడటం, అంతరిక్ష పరిశోధనల్లో నూతన సరిహద్దులను అధిగమించడం వరకు భారతదేశం తన జనాభా ప్రయోజనాన్ని (డెమోగ్రాఫిక్ డివిడెండ్) ప్రత్యక్షంగా అనుభవిస్తోందని స్పష్టం చేశారు. భారతదేశం సాధిస్తున్న అద్భుత ప్రగతికి ఇక్కడ ఉన్న యువత, నవకల్పనలే సజీవ నిదర్శనమని మంత్రి కొనియాడారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందిన పదబంధాన్ని ప్రస్తావిస్తూ కొందరు ‘నారాజ్ ఫూఫాజీలు’ (అసంతృప్త వ్యక్తులు) ఎల్లప్పుడూ భారతదేశ వేగాన్ని, దేశ యువత అపార సామర్థ్యాలను శంకించేందుకు కారణాలు వెతుకుతూనే ఉంటారని ఎద్దేవా చేశారు. భారతదేశ డెమోగ్రాఫిక్ డివిడెండ్ చేజారిపోయిందా లేక దేశానికి ‘భారం’గా మారిందా అంటూ కొందరు టీవీ స్టూడియోల్లో కూర్చుని అర్థంలేని చర్చలతో సమయాన్ని వృథా చేస్తున్నారని ఆర్థిక మంత్రి విమర్శించారు. ఇలాంటి నిరాశావాదుల (నయేసేయర్స్) మాటలను పట్టించుకోకుండా దేశం సాధిస్తున్న ప్రగతిని మనమంతా వేడుకలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశం సాధిస్తున్న డిజిటల్, సాంకేతిక పురోగతి 2047 నాటికి భారతదేశాన్ని సంపూర్ణ అభివృద్ధి చెందిన ‘వికసిత భారత్’గా తీర్చిదిద్దే లక్ష్యానికి బలమైన వేగాన్ని నిర్దేశిస్తోందని నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు.

## ఏజెన్సీలో గుడుంబా జోరు.. ఎక్సైజ్ శాఖ నిద్రపోతోందా?

**తెలుగు గళం, ములుగు సెప్టెంబర్ 11**

ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గుడుంబా దందా మళ్లీ జోరందుకుంటోందనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం, మంగపేట, తాడ్వాయి మండలాల్లో గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నా..ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.ముఖ్యంగా ఏటూరునాగారం మండలంలో గుడుంబా విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. కేవలం అప్పుడప్పుడు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం కాకుండా..గుడుంబా తయారీ కేంద్రాలు, సరఫరా మార్గాలు, రవాణా వ్యవస్థ, విక్రయదారులపై సమగ్ర నిఘా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.గుడుంబా మత్తుకు బానిసవుతున్న కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి, వ్యవసాయం తదితర పనుల ద్వారా సంపాదించిన డబ్బులో గణనీయమైన భాగం మద్యానికి ఖర్చవుతుండటంతో భార్యా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. మద్యం మత్తులో కుటుంబ కలహాలు, హింస, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. చిన్న వయసులోనే గుడుంబాకు అలవాటు పడుతున్న వారిపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

### చర్యలు ఎన్ని? కేసులు ఎన్ని?

గుడుంబా దందా ఇంత బహిరంగంగా జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్నప్పుడు ఇప్పటివరకు ఎక్సైజ్ శాఖ ఎన్ని దాడులు నిర్వహించింది? ఎన్ని కేసులు నమోదు చేసింది? ఎన్ని అక్రమ తయారీ కేంద్రాలను ధ్వంసం చేసింది? ఎంతమేర గుడుంబాను స్వాధీనం చేసుకుంది? ఎన్ని వాహనాలను సీజ్ చేసింది? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.అంతేకాకుండా అక్రమ గుడుంబా వ్యాపారానికి ఎవరైనా అధికారులు లేదా సిబ్బంది పరోక్షంగా సహకరిస్తున్నారనే అనుమానాలు ఉంటే.. వాటిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.“వారి వాటా ఎంత?” అనే ఆరోపణలకు తావులేకుండా ఎక్సైజ్ శాఖ తనిఖీలు, కేసులు, స్వాధీనం వివరాల్లో పూర్తి పారదర్శకత పాటించాలి అని ప్రజలు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

ఏజెన్సీ ప్రాంతంలో గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, అక్రమ దందా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.గుడుంబా దందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడే వరకు నిరంతర దాడులు కొనసాగించడంతో పాటు..ఏజెన్సీ ప్రాంతంలో మద్యం వ్యసనంతో నష్టపోతున్న కుటుంబాలకు అవగాహన, పునరావాస చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి గుడుంబా దందాపై సమగ్ర విచారణకు ఆదేశిస్తారా? లేక యథావిధిగా మౌనం వహిస్తారా? అనేది వేచి చూడాలి.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌లో భారత్ రికార్డు!




**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** దేశంలో మహిళల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. అత్యంత ప్రమాదకరంగా మారుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం చేపట్టిన జాతీయ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్ సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 80 లక్షలకు పైగా హ్యూమన్ పాపిలోమావైరస్ వ్యాక్సిన్ డోసులను విజయవంతంగా పంపిణీ చేసినట్లుగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని ప్రివెంటివ్ హెల్త్‌కేర్ చరిత్రలో ఇదొక కీలక మైలురాయిగా మంత్రిత్వ శాఖ అభివర్ణించింది.

14 ఏళ్ల బాలికల లక్ష్యంగా స్పెషల్ క్యాంపెయిన్..

మహిళల ప్రాణాలను హరిస్తున్న ప్రధాన క్యాన్సర్లలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రముఖమైనది. దీనిని మూలాల నుంచే అరికట్టాలనే లక్ష్యంతో, సరిగ్గా 14 ఏళ్ల వయస్సు నిండిన బాలికలను టార్గెట్ చేస్తూ ఈ దేశవ్యాప్త మెగా క్యాంపెయిన్‌కు రూపకల్పన చేశారు. భవిష్యత్తులో ఈ మహమ్మారి బారిన పడకుండా యువతను ముందస్తుగా రక్షించడమే ఈ వ్యాక్సినేషన్ ప్రధాన ఉద్దేశం. అయితే, ప్రాణాలను రక్షించే టీకాను సామాన్యులకు కూడా అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ సింగిల్ డోస్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఎలాంటి రుసుము లేకుండా పూర్తిగా ఫ్రీగానే అందిస్తున్నారు.

వాక్సినేషన్‌లో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

ఈ జాతీయ ఆరోగ్య ఉద్యమంలో పలు రాష్ట్రాలు విశేష చొరవ చూపుతున్నాయి. ముఖ్యంగా జాబితాలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా దూసుకుపోతోంది. కేంద్రం అందించిన లక్ష్యాల్లో ఇప్పటికే రాష్ట్రంలోని 14 ఏళ్ల వయసు గల బాలికలకు దాదాపు 98 శాతం పైగా వ్యాక్సినేషన్‌ను పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఆ తర్వాతి స్థానంలో 81 శాతం వాక్సినేషన్‌తో తమిళనాడు ఉంది.

## ఐటీ జాబ్స్‌కు తెలంగాణ బిగ్ బూస్ట్!


మొదటి పేజీ తరువాయి




త్వరలోనే ఆదిలాబాద్‌లో ఐటీ హబ్/టవర్‌ను లాంఛనంగా ప్రారంభించబోతున్నాం. యాంకర్ పార్ట్ నర్స్/ఇండస్ట్రీ పార్ట్ నర్స్ ముందుకొస్తే కొత్తగా ఐటీ హబ్స్/టవర్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి కేంద్రం ఏ మాత్రం సహకరించడం లేదు. ఈ విషయంలో బీజేపీ సభ్యులు చొరవ తీసుకోవాలి. తెలంగాణ యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేలా మా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. గత రెండేళ్లలో 75కి పైగా జీసీసీలు హైదరాబాద్ లో ప్రారంభమయ్యాయి. ఇది దేశంలోనే రికార్డు. రెండేళ్ల హయాంలో లక్ష మంది యువతకు కొత్తగా ఉద్యోగాలు దక్కాయి. త్వరలోనే కొత్త జీసీసీ పాలసీని తీసుకొస్తున్నాం. ఇందుకు సంబంధించిన కసరత్తు కొనసాగుతోంది. ఐటీ కంపెనీలకు సంబంధించిన కాంప్రహెన్సివ్ ఎకో సిస్టంను అభివృద్ధి చేయడంలో డేటా సెంటర్లు కీలక పాత్ర పోషించబోతున్నాయి. అందుకే.. వాటిపైన ప్రత్యేక దృష్టి సారించాం. రాబోయే రోజుల్లో డేటా సెంటర్ల వల్ల ఏర్పడబోయే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టాం. స్థానిక అవసరాలకు ఇబ్బంది తలెత్తకుండా డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లోనూ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.” అని శ్రీధర్ బాబు సమాధానమిచ్చారు.

## సీఎం బ్రదర్స్ భూదందా?


మొదటి పేజీ తరువాయి


దోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని, ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని సముద్రలింగాపురం ఊర్లో 800 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమాంతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందని విమర్శించారు. సీఎం బ్రదర్స్ భూములను కొల్లగొడుతున్నారని, మంత్రుల ముఠా ‘అలీ బాబా అరడజన్ దొంగల్లా’ తయారైందని ఆరోపించారు. మంత్రుల వాటాల వివాదంలో భాగంగానే మంత్రి పదవి నుంచి ఒకరిని బర్తరఫ్ చేశారని పేర్కొన్నారు. ‘తమ్ముడు లెట్స్ డూ కుమ్ముడు’ అన్నట్లుగా సీఎం బ్రదర్స్ దోచుకుంటున్నారని కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

బ్లాక్‌మెయిలర్ పాలన..

గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేసేవాడని, వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో.. రేవంత్ రెడ్డి అనే బ్లాక్‌మెయిలర్ ముఖ్యమంత్రి అయితే అలానే ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అత్తసొమ్ము అల్లుడికి దానం చేసినట్లుగా నగరం నడిబొడ్డున ఉన్న పారిశ్రామిక భూములను, మూసీ సుందరీకరణ పేరుతో వేల ఎకరాలను అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీలో 200 కోట్ల విలువ చేసే భూములను కేవలం రూ.7 కోట్లకే కట్టబెట్టారని మండిపడ్డారు. 2014కు ముందు భూములు కొనాలంటే మానసిక అనుమానాలు ఉండేవి కానీ, కేసీఆర్ సీఎం అయిన తర్వాత చెరువులకు నీటిని అందించి ఎకరం 5 లక్షల భూమిని 50 లక్షలకు చేర్చారని గుర్తుచేశారు. కొంగర కలాన్ లో కలెక్టరేట్ నిర్మించి భూముల రేట్లు పెంచామని తెలిపారు. రాబోయే రెండేళ్లలో కేసీఆర్ సీఎంగా రావడం ఖాయమని, 22ఏ తో నిషేధిత జాబితాలో పెట్టిన భూములన్నింటినీ కాపాడుకుంటామని కేటీఆర్ అన్నారు.

## పేదల ఇళ్లపై మళ్లీ డ్రామా ఎందుకు?


మొదటి పేజీ తరువాయి


### అధికారుల నిర్ణయాలకు విలువ లేదా?

గతంలో అధికారుల సమక్షంలో డ్రా నిర్వహించి ఇళ్లు కేటాయించిన తర్వాత ఇప్పుడు మళ్లీ డ్రా నిర్వహిస్తామని చెప్పడం పేదలకు తీవ్ర అన్యాయం చేయడమేనని జాన్ వెస్లీ అన్నారు. “గతంలో డ్రా నిర్వహించి ఇళ్లు కేటాయించిన అధికారులు అధికారులు కాదా? ఇప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలే ఎందుకు చెల్లాలి?” అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదలు ఏళ్ల తరబడి ఇళ్ల కోసం పోరాడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.ఇప్పటికే నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించి విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

### మంత్రి జోక్యం చేసుకోవాలి

జనగామ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ సమస్యపై తక్షణమే జోక్యం చేసుకుని, గతంలో కేటాయించిన 72 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆయా లబ్ధిదారులకే అందించేలా చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ కోరారు.సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి సీపీఎం రాష్ట్ర కమిటీ తీసుకెళ్తుందని తెలిపారు.పేదల సమస్య పరిష్కారం కాకపోతే న్యాయపోరాటాన్ని కొనసాగించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. పేదల ఇళ్ల విషయంలో ప్రభుత్వం మొండివైఖరి వీడి, గతంలో తీసుకున్న అధికారిక నిర్ణయాలను గౌరవించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా నాయకులు ఇర్రి అహల్య, బోట్ల శేఖర్, రాపర్తి రాజు, సింగారపు రమేష్, బూడిది గోపి, సుంచు విజేందర్, చందు నాయక్, ఎం.డి. అజారుద్దీన్, బోడ నరేందర్, మూడో వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి, లబ్ధిదారుల సంఘం అధ్యక్షుడు కళ్యాణం లింగం తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల హక్కులపై కేంద్రం కుట్రలు చేస్తోంది


మొదటి పేజీ తరువాయి




జాతీయ ఆహార భద్రత చట్టంలో కేంద్రం చేసే సవరణల వల్ల వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు.ఆహార భద్రత వికలాంగుల హక్కు అని, ఆ హక్కును తొలగించే అధికారం కేంద్రానికి లేదని స్పష్టం చేశారు.

2016 వికలాంగుల హక్కుల చట్టం అమలు, పర్యవేక్షణ కోసం జాతీయ స్థాయిలో చీఫ్ కమిషనర్, రాష్ట్ర స్థాయిలో స్టేట్ కమిషనర్లను నియమించాల్సి ఉందని తెలిపారు. అయితే ఆర్‌పీడీ చట్టంలోని సెక్షన్ 74లో కమిషనర్‌గా ఎవరినైనా నియమించే అవకాశం ఉండటం సరికాదన్నారు.వికలాంగుల సమస్యలను అర్థం చేసుకున్న వికలాంగులనే జాతీయ, రాష్ట్ర స్థాయి కమిషనర్లుగా నియమించే విధంగా సెక్షన్ 74ను సవరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగులకు కల్పిస్తున్న రిజర్వేషన్‌ను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఎన్‌పీఆర్‌డీ ఆరోపించింది. కేంద్ర వికలాంగుల శాఖ ప్రధాన కమిషనర్ నివేదికలో వికలాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రస్తావించినప్పటికీ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించింది.యూపీఎస్‌సీ ఇంజినీరింగ్ సర్వీసెస్‌లో 48వ ర్యాంకు సాధించిన అభ్యర్థికి సర్వీస్ కేటాయించకపోవడం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దృష్టిలోపం ఉన్నవారికి పోస్టు రిజర్వేషన్ ఉన్నప్పటికీ కేటాయించకపోవడం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో మేధో వైకల్యం ఉన్న వ్యక్తికి ఉద్యోగం నిరాకరించడం వంటి ఘటనలు ఆందోళనకరమని పేర్కొంది.కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి, వాటిని భర్తీ చేసేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేసింది.వికలాంగులకు అనుకూలంగా సామూహిక ప్రాంతాలను అందుబాటులోకి తీసుకురావాలనే నిర్ణయంలో కూడా ఆశించిన పురోగతి లేదని విమర్శించింది.అందుబాటులో లేని డిజిటల్ వ్యవస్థలను వికలాంగులు ఎలా వినియోగించుకోగలరని ప్రశ్నించింది.కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు, విధానాలు కాగితాలకే పరిమితమవుతున్నాయని ఎన్‌పీఆర్‌డీ విమర్శించింది. 2012 నుంచి వికలాంగుల పెన్షన్లలో కేంద్రం వాటా కేవలం రూ.300గా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నేటి పరిస్థితుల్లో రూ.300తో వికలాంగులు ఎలా జీవించగలరని ప్రశ్నిస్తూ, కేంద్రం తన వాటాను రూ.3,000కు పెంచాలని డిమాండ్ చేసింది.కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనాభా లెక్కల్లో 21 రకాల వైకల్యాలకు బదులుగా కేవలం 9 రకాల వైకల్యాల వివరాలను మాత్రమే సేకరించాలనే నిర్ణయం తీసుకుందని ఆరోపించింది. 21 రకాల వైకల్యాల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించింది.2014 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వికలాంగుల హక్కుల అమలును నిర్లక్ష్యం చేస్తోందని ఎన్‌పీఆర్‌డీ ఆరోపించింది.వికలాంగులు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను తిప్పికొడతామని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో దేశవ్యాప్త ప్రచార ఉద్యమం నిర్వహించాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించింది.సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ జాతీయ అధ్యక్షుడు గిరీష్ కీర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ నంబు రాజన్, ఉపాధ్యక్షులు ఎం.అడివయ్య, అనిర్బన్ ముఖర్జీ, ఝాన్సీరాణి, సహాయ కార్యదర్శులు సామ్య గంగూలీ, రిషికేష్, కోశాధికారి చక్రవర్తి, కమిటీ సభ్యులు కె.వెంకట్, ఆర్.వెంకటేష్, జె.రాజు, రంగప్ప, రాజన్, విల్సన్‌తో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

రేగొండ మండల పరిధిలోని రూపిరెడ్డిపల్లి శివారు మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు.ఎస్సై డి.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మన్నపేటకు చెందిన కొండమల్ల సురేందర్ ఎలాంటి అనుమతి లేకుండా వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు గుర్తించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ఇసుక తవ్వకాలు,రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

# బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం పరామర్శించారు. గోరికొత్తపల్లికి చెందిన 'మన తెలంగాణ' విలేకరి బత్తుల వెంకటేష్ తల్లి శాంతమ్మ ఇటీవల మృతి చెందగా,వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం,కోనరావుపేట సర్పంచ్ రొడ్డ కిరణ్ కుమార్ తండ్రి పెద్ద లింగయ్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగింపు"




**సత్తుపల్లి,ఆర్ సి, సెప్టెంబర్11(తెలుగు గళం) న్యూస్:**

సత్తుపల్లి పట్టణంలోని జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించబడుతున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ నందు 2026-27 విద్యా సంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాల నిమిత్తం గడువు తేదీని సెప్టెంబర్ 30 వరకు పొడిగించడం జరిగిందని కోఆర్డినేటర్ డా. చీపు పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. డిగ్రీలో అడ్మిషన్ పొందుటకు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఓపెన్ ఇంటర్,డిప్లొమా పాసైన విద్యార్థులు అర్హులని ఆయన అన్నారు.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో చదవాలనుకునే ఎస్.టి కోయ, చెంచు, గోండు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ విద్యార్థులకు ఉచిత డిగ్రీ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ డిగ్రీ చేయలేనివారు ముఖ్యంగా ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూరవిద్యలో పొందిన డిగ్రీకి రెగ్యులర్ విద్యలో పొందిన డిగ్రీతో సమానమైన అవకాశాలు ఉంటాయని వివరించారు. డిగ్రీ రెండవ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు సెప్టెంబర్ 30 లోపు చెల్లించాలని తెలిపారు.మరిన్ని వివరాలకు 9491881910, 8187837058 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

# అనారోగ్య బాధితులకు అండగా సీఎం సహాయ నిధి

**- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**



**తెలుగు గళం, కుక్కునూరు:**

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కుక్కునూరు మండలంలోని పెద్దరావిగూడెం గ్రామానికి చెందిన పల్లెల మరేశ్వరి వైద్య ఖర్చుల కోసం మంజూరైన రూ.66,572 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెకు స్వయంగా అందజేశారు. పల్లెల మరేశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం స్థానిక జనసేన నాయకులను సంప్రదించారు. వారి సూచన మేరకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించిన ముఖ్యమంత్రి కార్యాలయం మెరుగైన వైద్య సహాయం కోసం రూ.66,572 ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. మంజూరైన చెక్కును ఎమ్మెల్యే చిర్రి బాలరాజు లబ్ధిదారురాలు పల్లెల మరేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు మాట్లాడుతూ, తనకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో పాటు కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ, నాయకులు చల్ల కోటి, గాడిద వెంకటేశ్వర్లు, భద్రి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాలు, సర్వర్ కష్టాలు!

**-మీ-సేవ కేంద్రాల్లో వృద్ధుల అవస్థలు - పెన్షన్ దరఖాస్తుల గడువు పెంచాలి**

**- అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి(కె.రహీం)**



**పామిడి సెప్టెంబర్ 11,**

రాష్ట్రంలో కొత్తగా సామాజిక భద్రతా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు,ఒంటరి మహిళలు, వికలాంగులు, డప్పు కళాకారులు తదితర అర్హత కలిగిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సిపిఐ సీనియర్ నాయకుడు జిల్లా కార్యవర్గ సభ్యులు కే రహీం పేర్కొన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 3దేళ్లుగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, డప్పు కళాకారులు తమకు పెన్షన్ వస్తుందనే ఆశతో సచివాలయాలు, మీ-సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే వారికి అవసరమైన అర్హత పత్రాలు, ధ్రువపత్రాలు పొందడంలో తీవ్రజాప్యం జరుగుతోందని,కొన్ని సచివాలయాల్లో కంప్యూటర్లు పనిచేయకపోవడం, సర్వర్ సమస్యలు, సాంకేతిక లోపాలు ప్రజలకు మరింత ఇబ్బందికరంగా మారాయి. కొన్ని చోట్ల సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల కూడా దరఖాస్తుదారులు గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడుతోందని,

ప్రధానంగా వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, వికలాంగులు కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రభుత్వం నిర్ణయించిన గడువు సమీపిస్తుండగా సర్వర్లు పనిచేయకపోవడం, కంప్యూటర్ల సమస్యలు, విద్యుత్ సమస్య,అధికారుల అందుబాటులో లేకపోవడం వల్ల అర్హులైన అనేక మంది దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని, వీటన్నిటికీ తోడు వినాయకచవితి పండుగ సెలవులు, సమావేశాలు క్యాంపులు కారణంగా కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే సమయం తగ్గిపోవడంతో పెన్షన్ల దరఖాస్తుదారులపై మరింత గడువు ఒత్తిడి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు.

పెన్షన్ దరఖాస్తులకు ప్రభుత్వం ప్రకటించిన చివరి గడువును తక్షణమే పొడిగించాలని,

సర్వర్, కంప్యూటర్, సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి అన్ని సచివాలయాలు, సంబంధిత కేంద్రాల్లో సేవలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూడాలని, పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, డప్పు కళాకారులు తదితరులకు అవసరమైన అర్హత పత్రాలు, ధ్రువపత్రాలు సకాలంలో అందేలా అధికారులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ,

సచివాలయాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రత్యేకపర్యవేక్షణ ఉండాలని,సాంకేతిక సమస్యల కారణంగా గడువులో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులకు మరింత అవకాశం కల్పించాలని, ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రత్యేక సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

పెన్షన్ల మంజూరులో ఎలాంటి రాజకీయ జోక్యం, వివక్ష ఉండకూడదని, రాజకీయ పార్టీలకు అనుబంధాలకు అతీతంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పెన్షన్ అందేలా చూడాలని, ఆయన డిమాండ్ చేశారు.పెన్షన్ల గడువు పెంచి ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కే రహీం, కోదండరామిరెడ్డి, చౌడప్ప, రాముడు, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**• మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి • పాలకుర్తిలో శాంతి కమిటీ సమావేశం**



**పాలకుర్తి, సెప్టెంబర్ 11 (తెలుగు గళం)**

పాలకుర్తి సర్కిల్ పరిధిలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఏసీపీ వర్ధన్నపేట, సీఐ పాలకుర్తి, ఎస్ఐ పాలకుర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల పోలీస్ స్టేషన్ల పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు, డీజే నిర్వాహకులు, శాంతి కమిటీ సభ్యులు సుమారు 50 మంది హాజరయ్యారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. ప్రతి గణేష్ మండపాన్ని తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో పాటు, సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులను ముందుగానే పొందాలని స్పష్టం చేశారు. మండపం వద్ద కనీసం ముగ్గురు నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రిజిస్ట్రేషన్ సమయంలోనే గణేష్ నిమజ్జనం తేదీ, ప్రదేశం వివరాలను నమోదు చేయాలని తెలిపారు.ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.డీజేలకు అనుమతి లేదని, ఈ విషయంలో పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, జనసందోహం వంటి అంశాలపై నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపు, నిమజ్జనం సమయంలో భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మత విద్వేషాలకు దారితీసే వ్యాఖ్యలు, రెచ్చగొట్టే నినాదాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని హెచ్చరించారు.సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహిస్తూ పోలీసు శాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఏసీపీ వర్ధన్నపేట, సీఐ పాలకుర్తి, ఎస్ఐ పాలకుర్తి, ఎస్ఐ కొడకండ్లతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శ విద్యానికేతన్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

**-మట్టి వినాయకులను తయారు చేసి సంబరాలు జరుపుకున్న చిన్నారులు**

**తెలుగుగళం న్యూస్, పెద్దవడుగూరు.**

స్థానిక ఆదర్శ విద్యానికేతన్ పాఠశాలలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు పర్యావరణ అనుకూల మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జరిగే కాలుష్యాన్ని అరికట్టాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.ఈ సంబరాలలో పాఠశాల చిన్నారులు ఎంతో భక్తిశ్రద్ధలతో, సృజనాత్మకతతో తమ చిన్నారి చేతులతో అందమైన మట్టి గణపతులను తీర్చిదిద్దారు. తాము తయారుచేసిన విగ్రహాలకు పత్రాలు, సహజసిద్ధమైన పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన శ్లోకాల పఠనం, సాంస్కృతిక ప్రదర్శనలు పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కరణం నారాయణరావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో మన సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. చిన్నారులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండి, మట్టి గణనాథుడిని పూజించడం ద్వారా సమాజానికి గొప్ప సందేశాన్ని ఇచ్చారని కొనియాడారు. చిన్న వయసులోనే విద్యార్థుల్లో ఇలాంటి పర్యావరణ స్పృహను పెంపొందించడం ఎంతో అభినందనీయమని ఆయన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.



# అడవులు, వన్యప్రాణుల రక్షణలో అటవీ సిబ్బంది త్యాగాలు మరువలేనివి:-- ఎఫ్ఆర్ఓ అబ్దుల్ రెహమాన్

**అటవీ అమరవీరుల సేవలు స్ఫూర్తిదాయకం**
**అమరవీరుల సంస్కరణ దినోత్సవంలో అటవీ శాఖ అధికారులు**
**అడవుల పరిరక్షణపై అవగాహన కల్పించిన బైక్ ర్యాలీ**
**ఏటూరునాగారం రేంజ్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ**
**వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి**
**బస్టాండ్ వద్ద అటవీ శాఖ సిబ్బంది నినాదాలు**



**తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 11:**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో అటవీ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ రేంజ్ కార్యాలయం నుంచి ఏటూరునాగారం బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడే క్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా అధికారులు స్మరించుకున్నారు. అడవుల పరిరక్షణ కోసం అటవీ సిబ్బంది ఎదుర్కొంటున్న సవాళ్లు, విధి నిర్వహణలో వారు చూపుతున్న ధైర్యం, అంకితభావాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ.. అడవులు, వన్యప్రాణుల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బంది త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ప్రకృతి సంపదను భవిష్యత్ తరాలకు అందించాలంటే అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అటవీ అమరవీరులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం విధులు నిర్వహించారని, వారి త్యాగస్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో అక్రమ వేట, వన్యప్రాణుల వేట, అడవుల నరికివేత వంటి కార్యకలాపాలను అరికట్టడంలో ప్రజలు అటవీ శాఖకు సహకరించాలని కోరారు. అడవులు కేవలం చెట్ల సముదాయం కాదని, మన పర్యావరణ సమతుల్యతకు, వర్షపాతానికి, జీవవైవిధ్యానికి, వన్యప్రాణుల మనుగడకు అవి ఎంతో కీలకమని అధికారులు తెలిపారు. అడవులను రక్షించడం ద్వారా ప్రకృతిని, భవిష్యత్ తరాల జీవనాన్ని రక్షించినట్లేనని అన్నారు. బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. "అడవులను కాపాడుదాం.. వన్యప్రాణులను రక్షిద్దాం.. అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్నినో ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## : పాలా నాగ సురేంద్రరెడ్డి(బీజేపీ జిల్లా కార్యదర్శి)

సత్తుపల్లి/వేంసూరు, సెప్టెంబర్ 11(తెలుగుగళం) న్యూస్: మండలంలోని కందుకూరు గ్రామంలో ఎల్నినో ప్రభావంతో నష్టపోయిన పంటలను బీజేపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి పాలా నాగ సురేంద్ర రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యాలయ సంయుక్త కార్యదర్శి గొర్ల శ్రావణ్ కుమార్ రెడ్డి రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పాలా నాగ సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. బాధిత రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసి ఉంటే విపత్తుల సమయంలో రైతులకు నష్టపరిహారం అందేదన్నారు. కౌలు రైతులు ఎకరాకు భారీగా పెట్టుబడులు పెట్టి నష్టపోయారని పేర్కొన్నారు.

సీనియర్ నాయకుడు దొడ్డపనేని కృష్ణయ్య మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ప్రకటనలకే పరిమితమైందని, వేంసూరు మండలానికి ఇప్పటివరకు సాగునీరు అందలేదని విమర్శించారు.



ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో: మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్ రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసరావు, నాయకులు కొప్పుల మధుసూదన్ రెడ్డి, బండి వెంకటరెడ్డి, చల్లా అప్పిరెడ్డి, బండి ప్రభాకర్ రెడ్డి, తుమ్మూరు చంద్రమోహన్ రెడ్డి, ఖమ్మంపాటి వెంకటేశ్వరరావు, బండి చెన్నకేశవరెడ్డి, రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పోకడ పేరుతో ఫోటోలు పంపుతున్నారా? జాగ్రత్త!

### తెలియని అనువర్తనాలకు వ్యక్తిగత చిత్రాలు అప్పగిస్తే భవిష్యత్తులో ప్రమాదమే




సామాజిక మాధ్యమాల్లో రోజుకో కొత్త పోకడ వస్తోంది. ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే ఫోటో ఎడిటింగ్ అనువర్తనాలు యువతను, సామాన్యులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఫోటోను అప్‌లోడ్ చేస్తే చాలు.. క్షణాల్లోనే కొత్త దుస్తులు, కొత్త ప్రదేశం, సినిమా తరహా రూపం, వయస్సులో మార్పులు ఇలా అనేక రకాలుగా మార్చి చూపిస్తున్నాయి. దీంతో "అందరూ చేస్తున్నారు.. మనం కూడా చేద్దాం" అనే ఆలోచనతో చాలామంది తమ వ్యక్తిగత చిత్రాలను ఆలోచించకుండా తెలియని అనువర్తనాలకు పంపిస్తున్నారు. అయితే ఈ సరదా వెనుక వ్యక్తిగత గోప్యత, సమాచార భద్రతకు సంబంధించిన తీవ్రమైన ప్రమాదాలు దాగి ఉండే అవకాశం ఉంది. ఒక ఫోటోలో కేవలం ముఖం మాత్రమే కాకుండా వ్యక్తి గుర్తింపు, రూపురేఖలు, వయస్సుకు సంబంధించిన అంచనాలు, ఫోటో తీసిన ప్రదేశానికి సంబంధించిన వివరాలు వంటి సమాచారం కూడా ఉండొచ్చు. అలాంటి చిత్రాలను ఒక అనువర్తనానికి పంపిన తర్వాత అవి ఎక్కడ నిల్వ అవుతాయి? ఎంతకాలం ఉంచుతారు? ఎవరితో పంచుకుంటారు? వినియోగదారు ఫోటోను తొలగించిన తర్వాత అది పూర్తిగా తొలగుతుందా? అనే విషయాలు ముందుగానే తెలుసుకోవడం అవసరం. ఫోన్ నుంచి ఫోటోను తొలగించినంత మాత్రాన ఆ చిత్రం అనువర్తనం లేదా దాని సర్వర్ల నుంచి కూడా పూర్తిగా తొలగిపోయిందని భావించడం సరికాదు. అందుకే ఏదైనా కొత్త అనువర్తనాన్ని ఉపయోగించే ముందు దాని వెనుక ఉన్న సంస్థ, గోప్యతా విధానం, సమాచార వినియోగ నిబంధనలు, డేటా తొలగింపు విధానం వంటి అంశాలను పరిశీలించాలి. కృత్రిమ మేధ సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ ముఖచిత్రాలను ఉపయోగించి వాస్తవంగా కనిపించే నకిలీ ఫోటోలు, వీడియోలు రూపొందించడం కూడా సాధ్యమవుతోంది. వీటిని దుర్వినియోగం చేస్తే నకిలీ సామాజిక మాధ్యమ ఖాతాలు సృష్టించడం, మోసపూరిత సందేశాలు పంపడం, మార్ఫింగ్ చిత్రాలు తయారు చేయడం, వ్యక్తుల ప్రతిష్టకు భంగం కలిగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా మహిళలు, యువతులు తమ వ్యక్తిగత చిత్రాలను తెలియని అనువర్తనాలకు పంపే విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఒక అనువర్తనం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది కాబట్టి అది తప్పనిసరిగా సురక్షితమైనదని అర్థం కాదు. ఫోటో ఎడిటింగ్ కోసం ఉపయోగించే అనువర్తనం అవసరానికి మించిన అనుమతులను అడుగుతుందా అనే విషయాన్ని కూడా పరిశీలించాలి. కెమెరా, మైక్రోఫోన్, కాంటాక్ట్స్, సందేశాలు, ఫోన్‌లోని ఇతర ఫైళ్లకు అనుమతి ఎందుకు కోరుతున్నదో తెలుసుకోవాలి. అవసరం లేని అనుమతులు అడిగే అనువర్తనాలను ఉపయోగించకుండా ఉండటం మంచిది. ఫోటోను పంపించే ముందు ప్రతి ఒక్కరూ కొన్ని విషయాలను తప్పనిసరిగా ఆలోచించాలి. ఆ అనువర్తనం నమ్మదగినదేనా? నా ఫోటోను సంస్థ ఎలా ఉపయోగిస్తుంది? ఎక్కడ, ఎంతకాలం నిల్వ చేస్తుంది? మూడో వ్యక్తులతో నా సమాచారాన్ని పంచుకుంటుందా? ఫోటోను పూర్తిగా తొలగించే అవకాశం నాకు ఉందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లభించకపోతే వ్యక్తిగత చిత్రాలను అప్‌లోడ్ చేయకపోవడమే సురక్షితం. అదేవిధంగా సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత చిత్రాలను విచ్చలవిడిగా బహిరంగంగా ఉంచకుండా జాగ్రత్త వహించాలి. అనుమానాస్పదమైన లింకులను తెరవకూడదు. తెలియని వ్యక్తులు లేదా అనువర్తనాలు ఫోటోలు పంపాలని కోరితే అప్రమత్తంగా వ్యవహరించాలి. తమ చిత్రాలను ఎవరైనా దుర్వినియోగం చేసినట్లు అనిపిస్తే ఆధారాలను భద్రపరచుకుని వెంటనే కుటుంబ సభ్యులకు, సంబంధిత అధికారులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కొత్త పోకడలు కొన్ని రోజులు, కొన్ని వారాలు మాత్రమే ఉండవచ్చు. కానీ ఒకసారి ఆన్‌లైన్‌లోకి వెళ్లిన వ్యక్తిగత సమాచారం ఎక్కడికి చేరుతుందో, భవిష్యత్తులో ఎలా దుర్వినియోగం అవుతుందో చెప్పడం కష్టం. అందుకే ట్రెండ్ కోసం మన గోప్యతను పణంగా పెట్టకూడదు. ఫోటో మనది.. గోప్యత మనది.. జాగ్రత్త కూడా మనదే. "కొత్త పోకడ కంటే మన గోప్యత ముఖ్యం.. ఫోటో కంటే మన భద్రత ముఖ్యం!"



వ్యాస రచన– స్టీఫెన్ రాజ్
ఈ69న్యూస్–తెలుగు గళం దినపత్రిక రిపోర్టర్ ధర్మసాగర్

# ప్రభుత్వ అధికారులరా.. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించండి..!



### కడప టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి.

తెలుగు గళం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 11: ప్రభుత్వ కార్యాలయాలకు పలురకాల సేవలకై వచ్చే ప్రజలకు అధికారులు, సిబ్బంది విలువతో కూడిన సేవలందించాలని, వారి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, టిడిపి జిల్లా అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భూపేష్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని మైలవరం, కొండాపురం, ముద్దనూరు, పెద్దమొడియం, జమ్మలమడుగు, మండలాలలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలను ప్రజలు భూపేష్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి ప్రజల నుంచి వచ్చిన వినతి పత్రాలను పరిశీలించి సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్లో సంప్రదించి గ్రామీణ ప్రాంతాల నుండి పలు రకాల కారణాలతో వచ్చిన ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా అలాగే సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన లేకుండా చిన్నపాటి పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, వారి కార్యాలయ సిబ్బందికి అధికారులు సహకరించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలను ఒకటి, రెండుసార్లు కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అన్ని విభాగాల అధికారులు ప్రజలకు సహకరించాలని తెలిపారు. అనంతరం భూపేష్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులైన లబ్ధిదారులు ఉంటే వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలు ఏమైనా అందడంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని వెంటనే సంబంధిత శాఖలకు సంబంధించిన అధికారులతో సంప్రదించి వారికి సంక్షేమ పథకాలు లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, కూటమి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేవూరు నితీష్ కుమార్



నెల్లూరు జిల్లా నెల్లూరు(తెలుగు గళం):–శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఏపీ స్టూడెంట్స్ జేఏసీ (రిజిస్టర్ నెంబర్: 154 ఆఫ్ 2015) నూతన జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అలాగే వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రేవూరు నితీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు కూరపాటి గోపాల్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కూరపాటి గోపాల్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సమిష్టిగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు విద్యా రంగంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఫీజుల సమస్యలు, స్కాలర్‌షిప్‌లు, వసతి, రవాణా, విద్యార్థుల హక్కులు తదితర అంశాలపై ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రేవూరు నితీష్ కుమార్ నాయకత్వంలో జిల్లావ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను మరింత సమర్థవంతంగా వెలుగులోకి తీసుకువచ్చి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కూరపాటి గోపాల్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సమన్వయంతో గుర్తించి, వాటి పరిష్కారం కోసం అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు నూతన బాధ్యతలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. "వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా" కూడా రేవూరు నితీష్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించడంతో నియోజకవర్గంలోని విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఏర్పడిందన్నారు. విద్యార్థుల గొంతుకగా నిలిచి, వారి హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరంతరం పోరాటం సాగించేలా జేఏసీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. రేవూరు నితీష్ కుమార్ నియామకంపై జిల్లావ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నూతన బాధ్యతలు చేపట్టిన రేవూరు నితీష్ కుమార్‌ను సన్నిహితులు, స్నేహితులు, బంధువులు, విద్యార్థి నాయకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేస్తున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో రేవూరు నితీష్ కుమార్ కీలకంగా వ్యవహరిస్తారని, జిల్లాలో ఏపీ స్టూడెంట్స్ జేఏసీని మరింత బలోపేతం చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వినాయక ఉత్సవ మండపాలపై పకడ్బందీ ఏర్పాట్లు..

- శాంతిభద్రతలు, ట్రాఫిక్, పారిశుద్ధ్యంపై అధికారుల సమీక్ష..
- వెంకటాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి
- ప్రవీణ్ కుమార్.



తెలుగు గళం వెంకటాపురం (నూగూరు) సెప్టెంబర్ 11: ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని వినాయక చవితి సందర్భంగా నిర్వహించనున్న వినాయక ఉత్సవాల మండపాలపై నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని మండల స్థాయి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో మండల కేంద్రంలోని స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలోసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిమజ్జన ప్రదేశాల గుర్తింపు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, బారికేడింగ్, వైద్య మరియు అత్యవసర సేవల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. నిమజ్జనం అనంతరం వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వేణుగోపాల్, మండల పంచాయతీ అధికారి బొగ్గ నారాయణ, ఏఎస్ఐ బి.పురుషోత్తం, లైన్ ఇన్‌స్పెక్టర్ ఫరీద్, మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జమ్మలమడుగులో స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతస్థాయి సమావేశం..

### స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి...ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సూచన..



తెలుగు గళం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 11: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జమ్మలమడుగు నియోజకవర్గంలోని వైయస్సార్సీపి కార్యకర్తలు, నాయకులకు, ఎన్నికల నిర్వహణ, గెలుపోటములపై జమ్మలమడుగు పట్టణంలోని సాయి శివాని కళ్యాణ మండపం నందు శుక్రవారం ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వైయస్సార్ కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ కమిటీ జారీ చేసిన ఐడి కార్డు యొక్క విశిష్టత నాయకులకు మరియు కార్యకర్తలకు తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తెలుగుదేశం పార్టీ వైఫల్యాలను గ్రామ, పట్టణ, కార్పొరేషన్ స్థాయిలలో స్థానికంగా ఉన్న ప్రజలకు తెలియజేసి వైసీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో వైయస్ఆర్సీపీ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అద్భుతంగా పనిచేస్తున్నారని, నియోజకవర్గంలోని క్షేత్ర స్థాయిలో నాయకులు మొదలుకొని కార్యకర్తల వరకు బాగా కష్టపడుతున్న వైసీపీ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైన తాము కొండంత అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఇ సి మెంబర్ గిరిధర్ రెడ్డి, జమ్మలమడుగు పట్టణ పరిశీలకులు ఇందిరమ్మ, నియోజకవర్గ పరిశీలకులు పోరెడ్డి నరసింహారెడ్డి, యువ నాయకుడు శివారెడ్డి, మరియు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన జడ్పీహెచ్ఎస్ చీరవల్లి విద్యార్థులు

- డిస్కస్ త్రోలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ఎన్. రాజేంద్ర సాయి



తెలుగు గళం, కుక్కునూరు: ఏలూరు జిల్లా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో జడ్పీహెచ్ఎస్ చీరవల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 9, 10 తేదీలలో ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థులు వివిధ విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో 9వ తరగతి విద్యార్థి ఎన్ రాజేంద్ర సాయి అండర్–18 విభాగంలో డిస్కస్ త్రోలో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో రాజేంద్ర సాయి పాల్గొననున్నాడు. విద్యార్థి సాధించిన విజయంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి రాజేంద్ర సాయిని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.